

'ఉపాధి'లో అవకతవకలకు చోటివ్వొద్దు



మాడ్గుల, జనవరి 23:ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు ఆస్కారం ఇవ్వొద్దని డీఆర్డీఏ పీడీ ప్రభాకర్ అన్నారు. అప్పారెడ్డిపల్లి, కొల్కులపల్లి, దొడ్లపహాడ్ గ్రామాల్లో మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మూడు బృందాలుగా పనులపై ఆరా తీశారు. కూలి చెల్లింపులపై వివరాలు తెలుసుకున్నారు. ఎంపీపీ పద్మ, ఏపీడీ నక్రునాయక్, ఎస్సార్పీ వెంకన్న, ఎంపీడీవో రాఘవులు, ఏపీవో నర్సింగ్ పాల్గొన్నారు.



- స్వచ్ఛమైన తేనె ఉత్పత్తిపై ఔత్సాహికుల దృష్టి
- రైతులకు అదనపు ఆదాయాన్నిస్తున్న తేనెటీగల పెంపకం
- ఓ వైపు జీవ వైవిధ్యం, మరో వైపు పంటలకు ప్రాణం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు పెంపకందారులు

తేనెపట్టు.. డబ్బు మస్తు!

ఔత్సాహికులు కొందరు తేనెటీగల పెంపకాన్ని చేపడుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలవడంతో పాటు వినియోగదారులకు స్వచ్ఛమైన తేనె అందజేస్తున్నారు. ప్రత్యేకంగా తేనెటీగలతో కూడిన బాక్స్‌లను కొనితెచ్చి ఉద్యానపంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. మరి కొందరికి పని కల్పిస్తున్నారు. తేనెటీగల పెంపకంతో ఓ వైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూనే పంటలకు ప్రాణం పోస్తూ.. ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ 'బీ కీపింగ్(తేనెటీగల పెంపకం) పెంపకందారులు, రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది.



గుంతపల్లిలో తేనెటీగల పెంపకం బాక్స్‌లు

వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం


(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 23): ఒకప్పుడు అడవుల్లో, భారీ చెట్లకు మాత్రమే దొరికే తేనె ఇప్పుడు వ్యవసాయ అనుబంధరంగ పరిశ్రమగా మారింది. కొన్నేళ్ల కిందటి వరకు ఆంధ్ర, ఇతర ప్రాంతాలకే పరిమితమైన తేనెపట్టుల పెంపకం ఇప్పుడు తెలంగాణలోనూ క్రమంగా విస్తరిస్తోంది. స్వచ్ఛమైన తేనెకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండడంతో ఈ 'బీకీపింగ్(తేనెటీగల పెంపకం) రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఒక్కసారి పెట్టుబడిపెట్టి అనువైన స్థలంలో మొదలుపెడితే క్రమం తప్పక ఆదాయం రావడం ఈ పెంపకం ప్రత్యేకత. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలువురు రైతులు మధురమైన తేనె ఉత్పత్తికి మక్కువ చూపుతున్నారు. తేనెటీగల పెంపకంపై ఇప్పుడిప్పుడే రైతులు ఆసక్తి చూపుతూ రాణిస్తున్నారు. తేనెటీగలతో కూడిన బాక్స్‌లను కొనితెచ్చి ఉద్యానపంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఓవైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూనే మరో వైపు ఉపాధి పొందుతున్నారు. అలాగే తేనెటీగలతో పరాగ సంపర్కానికి తోడ్పడుతూ పంటలకు ప్రాణం పోస్తూ సాటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తేనెటీగలను పెంచుతారిలా..

తేనెటీగలను బాక్స్‌ల్లో పెంచుతారు. ఒక్కో బాక్స్‌లో మైనం షీట్స్ కలిగిన 8-10 ఫ్రేమ్‌లు ఉంటాయి. వాటిల్లోనే తేనెటీగలుంటాయి. అవి బయటకు వెళ్లేందుకు, తిరిగి బాక్స్‌లోకి రావడానికి బాక్సులో ఒకేదారి ఉంటుంది. బాక్స్ మూత తీసినా తేనెటీగలు లేచి పోవు. మొత్తంగా ఒక బాక్స్‌లో 50వేల నుంచి నుంచి లక్ష తేనెటీగలు పడుతాయి. ఇందులో ఒక రాణి(పరిపూర్ణమైన ఆడ ఈగ. దీన్ని క్వీన్ బీ అంటారు). వేలల్లో కూలీ ఈగలు(అసంపూర్ణ ఆడ ఈగలు), వందలాదిగా మగ ఈగ(వీటిని డ్రోన్స్ అంటారు)లు ఉంటాయి. ఇవి రాణి ఈగ డైరెక్షన్‌లో పనిచేస్తాయి. మరికొన్ని ఈగలు పూలు, పూతపై ఉండే ఎంజైమ్స్‌ని, పుప్పొడిని, మరికొన్ని మకరందాన్ని, బంకపై ఉండే మైనాన్ని తెచ్చి జమ చేస్తాయి. మరికొన్ని ఈగలు రాణి ఈగ కోసం రాజాహారం(రాయల్ జెల్లీ)ని తెస్తాయి. ఇక బాక్స్‌లో ఉండే ఈగలు మైనంతో గదులను చక్కగా నిర్మిస్తుంటాయి. ఇక మకరందాన్ని తెచ్చిన తీగలు దానిని తేనేగా మార్చి గదుల్లో నింపి సీల్ వేస్తాయి. ఇక బాక్స్‌లో చనిపోయిన ఈగల కళేబరాలను మరికొన్ని ఈగలు బయట పడేస్తుంటాయి. బాక్స్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి కొండ ఈగలు, దోమలు, ఈగలు, బల్లులు రాకుండా 15-20 తేనెటీగలు కాపలా కాస్తుంటాయి.

తేనెటీగల పెంపకంపై మక్కువ

తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది, ఉద్యానపంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ, కంది పంట చేలల్లో తేనెటీగల పెట్టెలను అమర్చి లాభాలు పొందొచ్చు. ఏడాది పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచొచ్చు. తద్వారా వినియోగదారులకు స్థానికంగా తక్కువ ధరకు స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె దొరుకుంది. తేనెటీగలు అంతరించిపోకుండా పర్యావరణాన్నీ పరిక్షించుకోవచ్చు. తేనెటీగలు పుప్పొడితో పరపరాగ సంపర్కం చేస్తూ పండ్ల తోటలు, కూరగాయల సాగులో రైతులకు అధికదిగుబడి సాధించేందుకు దోహదపడతాయి. పొలాల్లో తేనెటీగలతో పరాగ సంపర్కం జరిగి సాధారణంగా వచ్చే దిగుబడికన్నా 40శాతం వరకు అధిక ఎక్కువ దిగుబడి సాధ్యం అవుతుంది. దీన్ని గ్రహించిన పలువురు రైతులు తేనెటీగల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.



తేనె బాటిళ్లు

రూ.30వేల పెట్టుబడితో ప్రారంభించి..

హైదరాబాద్‌కు చెందిన వాకనాగ కోటేశ్వర రావు రూ.30వేల పెట్టుబడితో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా మన్నెగూడ పరిధి మీర్జాపూర్ వద్ద రెండేళ్ల క్రితం 14బాక్స్‌లతో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించిన ఆయన ఇప్పుడు ఏకంగా 300 బాక్స్‌ల వరకు విస్తరింపచేశారు. మన్నెగూడతో పాటు కొడంగల్, నిజాంపేట్, సిద్దిపేట, అరకలో తేనెటీగల పెంపకాన్ని చేపడుతున్నారు. మొత్తం 2,500 బాక్సుల్లో తేనెటీగలను పెంచుతున్నారు. మన్నెగూడ వద్ద మోహన్ హనీ పేరుతో షాపును ఏర్పాటు చేశారు. రెండెకరాల్లో మామిడి, సన్‌ఫ్లవర్ తోట సాగుచేశారు. దీని పక్కనే తేనెటీగల పెట్టెలు అమర్చారు. ఒక్కో బాక్స్‌లో 8 ట్రేలున్నాయి. ఒక్కో బాక్స్ నుంచి 2 నుంచి 5కిలోల వరకు తేనె లభిస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. ఇక్కడ ముగ్గురు రైతులు ఉపాధి పొందుతున్నారు. వేమ, పొద్దుతిరుగుడు రకం తేనె విక్రయిస్తున్నారు. కిలో తేనె రూ.700-800 వరకు అమ్ముతున్నారు. నెలకు రూ.4లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. అన్ని ఖర్చులు పోను రూ.2లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.

ఉద్యోగం వీడి

సూర్యాపేట జిల్లా, మద్రికుంటకు చెందిన జూకూడి అనూష భర్త సుమన్‌తో కలిసి తేనెటీగల పెంపకాన్ని నేర్చుకున్నారు. ఆమె పూర్తిగా తేనెటీగల పెంపకానికి పరిమితమైపోతే, భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే తేనెటీగల పెంపకంలో భార్యకు సహకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తేనెటీగల పెంపకంపై రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీలో పది రోజులు శిక్షణ తీసుకొన్నారు. 'బీ' ఫ్రెష్' బ్రాండ్ పేరుతో తేనె ఉత్పత్తిని ప్రారంభించారు. ఏడాది పూర్తి కాకముందే హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాలకు తేనెను సరఫరా చేస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్నారు. ఆధునిక సాగు విధానాలతో తోటి రైతులకు వారు ఆదర్శంగా నిలుస్తున్నారు. రూ.50వేల పెట్టుబడితో యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో ఐదు బాక్సులతో తేనెటీగల పెంపకాన్ని మొదలుపెట్టారు. ఏడాది తిరిగే సరికి రూ.20లక్షలు వెచ్చించి 250బాక్సులకు తేనెటీగల పెంపకాన్ని విస్తరించారు. వికారాబాద్ జిల్లా తాండూరు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి గుంతపల్లి ప్రాంతంలో తేనెటీగల పెంపకం, ఉత్పత్తి చేస్తున్నారు. వానకాలం సీజన్‌లో నిజామాబాద్‌లో పొద్దు తిరుగుడు చేన్లలో, అలాగే ఆర్మూర్‌లో నువ్వుల పంట సమయంలో తేనెటీగల బాక్సులను ఏర్పాటు చేసి అక్కడే ఉత్పత్తి చేస్తున్నారు. ఆ తేనెను ఎల్బీనగర్‌లోని ప్యాకింగ్ పాయింట్‌కు తరలించి 'బీ ఫ్రెష్' బ్రాండ్ పేరిట అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ఉత్పత్తులు అమెజాన్ సంస్థతో పాటు బీఫ్రెష్.కామ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.



- తేనెపట్టును పరిశీలిస్తున్న అనూష, సుమన్ దంపతులు

స్వచ్ఛమైన తేనె అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది



2014లో నేను ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు, 2016లో అమెరికా వెళ్లినప్పుడూ అక్కడ స్వచ్ఛమైన తేనె రుచి చూశాను. ఇలా మన ప్రాంతంలోనూ స్వచ్ఛమైన తేనె ప్రజలకు అందుబాటులోకి తేవాలనే సంకల్పం కలిగింది. 2019లో ఇండియాకు తిరిగొచ్చిన నేను.. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఉద్యోగానికి స్వస్తి చెప్పి తేనెటీగల పెంపకంలోకి అడుగుపెట్టాను. తొలుత చాలా ఇబ్బందులు పడ్డాను. కానీ వెనకడుగు వేయలేదు. కుటుంబం నుంచి ప్రోత్సాహం లభించింది. మా వృత్తిని అభివృద్ధి చేస్తూ ఎంతో మందికి ఉపాధి కల్పించాం. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కూడా ఇస్తాం. ప్రతీది కల్తీ అవుతున్న ఈ రోజుల్లో ప్రజలకు స్వచ్ఛమైన తేనెను అందిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది.

- జోకూడి అనూష

అదనపు ఆదాయం వస్తుంది



ప్రజల్లో తేనె వినియోగం పెరిగింది. మన వద్ద డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. షాపుల్లో వినియోగదారులకు నకిలీ బ్రాండ్ల తేనె అంటగడుతున్నారు. అందుకే నేను తేనెటీగల పెంపకాన్ని ఎంచుకున్నా. తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించొచ్చు. ప్రభుత్వం కూడా తేనె ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. రైతులు కూడా తమ పొలాల్లో బాక్స్‌లు ఏర్పాటు చేసుకుంటే అదనపు ఆదాయం పొందొచ్చు. తేనె టీగలతో పరాగ సంపర్కం కలిగి గింజ గట్టిపడి ఫలసాయం వృద్ధితో పంట దిగుబడి పెరిగే అవకాశముంది. మన్నెగూడ, నిజాంపేట్, కొడంగల్, సిద్దిపేట ప్రాంతాల్లో తేనెటీగల పెంపకాన్ని కొనసాగిస్తున్నా. నేను మన్నెగూడ వద్ద మోహన్ హనీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాను. అక్కడ మొదట్లో 14 బాక్సులతో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభిచాను. ప్రస్తుతం 150 బాక్స్‌లకు చేరుకుంది. నాకు నెలకు అన్ని ఖర్చులు పోను రూ.2లక్షల వరకు ఆదాయం వస్తోంది.

- వాకనాగ కోటేశ్వరరావు



మన్నెగూడ వద్ద యంత్రంతో తేనె తీస్తున్న రైతు



తేనెపట్టును పరిశీలిస్తున్న రైతులు

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- రూ.40వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్
- ఇంటి నంబర్ కేటాయింపునకు రూ.60వేలు డిమాండ్



ఏసీబీకి పట్టుబడ్డ ఉద్యోగులు లక్ష్మీనరసింహ, నాగరాజు

శంషాబాద్ రూరల్, జనవరి 23: ఇంటి నంబరు కేటాయింపునకు రూ. 40వేలు లంచం తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన మంగళవారం శంషాబాద్ మండలం నర్కూడలో జరిగింది. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన ఎల్.మధు నర్కూడలోని అమ్మపల్లిలో తనకున్న 200 గజాల్లో ఇల్లు కట్టుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మధు ఈ నెల 2న ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నాడు. నంబర్ కేటాయించాలంటే రూ.60వేలు లంచం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహ డిమాండ్ చేశాడు. ఇందుకు బిల్ కలెక్టర్ నాగరాజుతో మాట్లాడాలని మధుకు కార్యదర్శి చెప్పాడు. 20 రోజుల పాటు ఆ ఇద్దరు అధికారుల చుట్టూ తిరిగిన మధు చివరకు రూ.40వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇదే విషయమై మంగళవారం బాధితుడు మధు ఏసీబీని ఆశ్రయించాడు. పంచాయతీ కార్యాలయంలో మధు నుంచి డబ్బు తీసుకుంటుండగా లక్ష్మీనరసింహ, నాగరాజులను ఏసీబీ డీఎస్పీ భద్రయ్య, సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో లండన్ లయన్స్ క్లబ్ బృందం

ప్రభుత్వ బడుల నిర్వహణ భేష్

- లండన్ లయన్స్ క్లబ్ బృందం
- తలకొండపల్లి ఉన్నత పాఠశాల సందర్శన
- స్కూలుకు మూడు కంప్యూటర్ల వితరణ

తలకొండపల్లి, జనవరి 23: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు ప్రశంసనీయంగా ఉందని లండన్ లయన్స్ క్లబ్ బృందం, సుగుణ రామ్మోహన్‌రావు ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. తలకొండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం లండన్ లయన్స్ క్లబ్ బృందం, ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మాధవిల ఆధ్వర్యంలో 22మంది ప్రతినిధులు విద్యార్థులతో సమావేశమై వసతులు, సాధిస్తున్న ఫలితాలు, ప్రభుత్వపరంగా అందుతున్న సహకారం తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టడం ద్వారా సామర్థ్యాలను తెలుసుకున్నారు. సుగుణ రామ్మోహన్‌రావు ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్, డిజిటల్, సైన్స్ ల్యాబ్‌లను, లైబ్రరీని పరిశీలించి వాటి ద్వారా పొందుతున్న ప్రయోజనాన్ని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. పాఠశాలకు కొత్తగా మూడు కంప్యూటర్లు, పలు ఉపకరణాలను అందజేశారు. స్థానిక ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ లలితజ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు, పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సజ్జుపాషా, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్


మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

షాద్‌నగర్ రూరల్, జనవరి 23: షాద్‌నగర్ మున్సిపాలిటీతో పాటు కొత్తూరు మున్సిపాలిటీలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రెండు మున్సిపాలిటీల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ ద్వారా ఎన్ని నిధులొచ్చాయి? ఆ నిధులతో చేసిన అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన నిధుల వివరాలు తెలుసుకొని వాటితో జరిగిన పనుల వివరాలు అడిగారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ఎన్ని నిధులైనా తీసుకువస్తామని, సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆదరాబాదరగా అభివృద్ధి పనుల కోసం ప్రొసీడింగ్‌లు ఇచ్చారని, కానీ నిధులు మంజూరు కాలేదని ఎమ్మెల్యేతో అధికారులు తెలిపారు. మరి ఆ ప్రొసీడింగులకు నిధులు వస్తాయా? అని ఎమ్మెల్యే ఆరా తీశారు. సమావేశంలో కమిషనర్లు వెంకన్న, వీరేందర్, డీఈ సాజిద్, ఏఈలు నర్సింహ, నరేష్ పాల్గొన్నారు.

చరిత్ర ఆనవాళ్లు శిథిలం



లక్ష్మీనరసింహ స్వామి ఆలయం



ఆలయ ఆవరణలో శిలాశాసనం

- నాటి కొనదుర్గమే నేటి కొందుర్గు
- చారిత్రక ప్రాధాన్యంపై దృష్టిపెట్టని పాలకులు
- మరుగునపడ్డ పూర్వ వైభవం

కొందుర్గు, జనవరి 23: పాడి పంటలు, వజ్ర వైడూర్యాలతో తులతూగిన నాటి కొనదుర్గమే నేటి కొందుర్గు. ఇక్కడ నేటికీ అడుగడుగునా చారిత్రక అవశేషాలు కన్పిస్తున్నాయి. వాటిని భద్రపర్చడంలో, పరిశోధించంలో, చారిత్రక అంశాలపై భవిష్యత్తు తరాలకు తెలియజేయడంలో పాలకులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారనే చెప్పాలి. చరిత్రలోకి వెళ్తే.. నేటి కొందుర్గును 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు ఈ దుర్గాన్ని నిర్మించినట్లు చరిత్ర చెపుతోంది. 12వ శతాబ్దంలో బీజాపూర్ సుల్తానులు దండయాత్రతో ఈ దుర్గాన్ని వశపర్చుకున్నారు. సుల్తానులు కొంత కాలం పాలించగానే యుద్ధంలో కాకతీయ రాజులు వారిని ఓడించి దుర్గాన్ని ఆధీనపర్చుకున్నారు. కాకతీయులు పాలన సౌలభ్యం కోసం తమ రాజ్యాన్ని మూడు సంస్థానాలుగా విభజించారు. అది దుర్గం. ఇది ఆలూరు మండలంలో ఉంది. మరోటి అల్లాదుర్గం. ఇది పాత మెదక్(నూతన సంగారెడ్డి)జిల్లాలో ఉంది. మరోటి కొనదుర్గం(కొందుర్గు)గా విభజించారు. కొనదుర్గం మూడు సంస్థానాలకు డివిజన్‌గా ఉండేది. ఒక్కో దుర్గం కింద 150గ్రామాలుండేవి. ప్రతీ డివిజన్‌కు ఒక ఖిలాదారు ఉండేవారు. కొనదుర్గాన్ని పాపాన్నపేట(మెదక్ జిల్లా) సామంతులు పాలించేవారు. కొనదుర్గాన్ని(కొందుర్గును) మూడు గవినుల గ్రామామని పిలిచేవారు. కొనదుర్గం సంస్థానంలో జిల్లేడ్ ఒక చిన్న సంస్థానంగా ఉండేది. జిల్లేడ్‌కు సమీపంలో ఉన్న చౌదరిగూడెంలో కమ్మరులు ఎక్కువగా ఉండేవారు. వారు కాకతీయ సామ్రాజ్యానికి అవసరమైన కత్తులు, తుపాకులను తయారు చేసి, మిగితా దుర్గాలకూ సరఫరా చేసేవారు. చౌదరిగూడెంలో కమ్మరిపేట అనే వీధి ఉంది. అక్కడ వారు ఆయుధాలు తయారు చేయగా, మిగిలిన అవశేషాలు గుట్టగా ఉండేవి. కాకతీయుల పాలనలో ప్రజలు సుఖశాంతులతో జీవించేవారు. కాకతీయ సామ్రాజ్యం పతనానంతరం 16వ శతాబ్దంలో గోల్కొండ నవాబులు ఈ దుర్గాన్ని వశపరుచుకున్నారు. ఔరంగజేబు సేనాధిపతి మాలిక్‌కాఫర్ గోల్కొండ రాజ్యంపై దండయాత్ర చేసి ఈ దుర్గాన్ని ముట్టడించారు. ఆ దండయాత్రలో ఇక్కడి ఆలయాలను కొల్లగొట్టారు. సుందరంగా ఉండే సోమనాథ ఆలయాన్ని ధ్వసం చేసి, అందులో ఉన్న దేవతా విగ్రహాలను పగులగొట్టి వజ్రాలు, నగలను ఎత్తుకెళ్లారు.

గతమెంతో ఘన కీర్తి

కొనదుర్గానికి 2కిలోమీటర్ల దూరంలో పెండ్యాల అనే గ్రామం ఉండేది. అక్కడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉండేది. అక్కడి నుంచి ప్రస్తుతం కొందుర్గు మధ్యలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు ప్రతీ దసరా పండుగ సమయంలో జాతర జరిగేది. జాతరలో ఏనుగులు నాట్యం చేసేవని, వజ్రవైడూర్యాలు, రత్నాలు రాసులుగా పోసేవారని చెబుతుంటారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఉన్న విగ్రహాలతో పాటు పెద్ద ఎత్తున బంగారు నిధుల్ని ఔరంగాజేబ్ సైన్యం తరలించుకు పోయినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. మొఘల్ సామ్రాజ్యం పతనానంతరం ఈ దుర్గాన్ని నిజాముల్ ముల్క్ ఆసఫ్‌జా వశపర్చుకున్నాడు. అప్పట్లో 14 జిల్లాలను కలిపి దక్కన్ సామ్రాజ్యం ఉండేది. వీరు కృష్ణా, గోదావరి నదుల మధ్య భాగాన్ని పాలించారు. కాకతీయుల పాలన అంతమైన తరువాత వచ్చిన పాలకులు ప్రజలపై పన్నుల భారం అధికంగా వేశారు. ఇలా ఎంతో మంది రాజులకు సంస్థానంగా నిలిచిన కొనదుర్గం వైశిష్ట్యం, వైభవం నేడు కాలగర్భంలో కలిసిపోయింది. రాజులు, రాచరికాలు అంతరించిన తరువాత వాడుక భాషలో కొనదుర్గం కాస్త కొందుర్గుగా మారింది. నాడు ఎంతో ఉన్నత స్థానం సంపాదించుకున్న కొందుర్గు నేడు మండల కేంద్రంగా మారింది. పాత కాలం నాటి శిలా శాసనాలను సైతం భద్రపర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.



భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

కొత్తూర్, జనవరి 23 : భారీ వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించి, సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద గల ఐవోసీఎల్(ఇండేన్ బాట్లింగ్ యూనిట్)లో మంగళవారం సాయంత్రం షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఏసీపీ హాజరై సూచనలు చేశారు. భారీ వాహనాల డ్రైవర్లు ఓపికతో వాహనాలు నడపాలన్నారు. నిద్రమత్తులో, లోవర్ లోడింగ్‌తో వాహనాలను నడపొద్దన్నారు. రాంగ్ రూట్లలో వాహనాలను నిలపొద్దని, ట్రక్ బేస్‌లలోనే వాహనాలను నిలుపుకోవాలన్నారు. ట్రక్కులు నిలిపిన సమయాల్లో బ్లికింగ్ లైట్లు, ఇండికేటర్లు విధిగా వేయాలన్నారు. లేకుంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. అలాగే డ్రైవర్లు యూనిఫాం ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు, హైవేపై సూచికలు తప్పక పాటించాలని, ట్రక్కులు వాటికి కేటాయించిన లేన్లలో మాత్రమే ప్రయాణించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు భారీ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

కీసర రూరల్, జనవరి 23: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం అభినందనీయమని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రీన్ సోల్, ముంబై కంపనీ సహకారంతో విశ్వాసీ సాంగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు చెప్పులు (స్లిప్పర్స్), సిట్టింగ్ మ్యాట్లను పంపిణీ చేశారు. విశ్వాసి సాంగతి స్వచ్ఛంద సంస్థ జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ.. పేదవిద్యార్థులకు సహకారంగా చెప్పులు, మ్యాట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నాగారం మున్సిపాలిటీలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లోని 2,365మంది విద్యార్థులకు ఈ వస్తువులను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం పాల్గొన్నారు.

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 23: తెలంగాణ రెవన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏవో అమరేందర్‌లతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, రెవెన్యూ శాఖ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

తగ్గిన కందిపప్పు ధరలు

● కేజీ రూ.180 నుండి రూ.150కి తగ్గింపు



తాండూరు కందిపప్పు

తాండూరు : జనవరి 23: రుచికి శుచికి మారుపేరైనా తాండూరు కందిపప్పు ధరలు తగ్గుముఖం పట్టాయి. నెల రోజుల కిందట కిలో రూ.180 ఉండగా ప్రస్తుతం కిలో రూ.150కి చేరింది. కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన కందుల కోతలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కందులు మార్కెట్‌లోకి క్రయ, విక్రయాలు జరిగి కంది పప్పు ధర మరింత తగ్గే అవకాశముందికంది పప్పుకు భౌగోళిక గుర్తింపు కారణంగా ఈ పప్పుకు డిమాండ్ ఉంది.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
PVR గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR ఎస్2 వోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

▸ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 23: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రూపొందించిన జిల్లా డైరీని ఆయన ఆవిష్కరించారు. గత ఫలితాలకన్నా ఈ సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు రాబట్టాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో తన దృష్టికి వచ్చిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గర్భిణీలు, బాలింతలు, దివ్యాంగులకు మినహాయింపునివ్వాలని ఎస్టీయూ నాయకులు కలెక్టర్‌ను కోరారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున అల్పాహారం ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్వచ్ఛ కార్మికులను నియమించాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, నాయకులు పరమేష్, బాలకృష్ణలున్నారు.



సీతారాముల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాండూరులో సీతారాముల ఊరేగింపు

తాండూరు, జనవరి 23: అయోధ్య రామ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా తాండూరులో గోశాల సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం రెండోరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగాయి. స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి పట్టణ వీధుల గుండా సీతారాముల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారకులు చికోటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. శ్రీరామ కీర్తనలతో ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది.

సమస్యల పరిష్కారంతోనే

ప్రజాప్రతినిధులకు గుర్తింపు

మేడ్చల్ టౌన్, జనవరి 23: ప్రజా సమస్యల పరిష్కారంతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గౌడవెల్లి గ్రామంలో మంగళవారం పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని, పోస్టాఫీస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ వారు పలు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ మొదటి అంతస్తు భవనం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించి పనులు చేపట్టడం పట్ల సర్పంచ్‌ను అభినందించారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌడవెల్లి గ్రామాభివృద్ధికి స్థానిక పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఉపసర్పంచ్ పెంటమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రైల్వే అండర్ బై పాస్ బ్రిడ్జి పనుల పరిశీలన

మేడ్చల్ టౌన్, జనవరి 23: మేడ్చల్ పట్టణంలో నిలిచిన రైల్వేఅండర్ బై పాస్ బ్రిడ్జి పనులను జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. గత నాలుగు సంవత్సరాల కిందట ప్రారంభించిన బ్రిడ్జి పూర్తి కాకపోవటంతో మేడ్చల్ పట్టణ వాసులతో పాటు,



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ శరత్ చంద్రారెడ్డి

మండలంలోని 7 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు జడ్పీచైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని స్థానికులు వివరించారు. చైర్మన్ స్పందిస్తూ.. అండర్ బై పాస్ బ్రిడ్జి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైల్వేశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నందున పనుల్లో జాప్యం సహజమని, పట్టించుకునే వారుంటే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జడ్పీకి ప్రత్యేక నిధులివ్వండి

▸ స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు జడ్పీ చైర్‌పర్సన్ వినతి



స్పీకర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 23: జిల్లా పరిషత్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఇప్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్ నివాసంలో మంగళవారం సునీతారెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధిపై ఇద్దరి నేతలు చర్చించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి అదనపు నిధులు ఇవ్వాలని కోరారు. సీఎం జిల్లా కాబట్టి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. దీనికి స్పీకర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా అభివృద్ధికి సీఎంను కలిసి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మోమిన్‌పేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరోత్తంరెడ్డి ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ

విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 23: పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం మొబిలైజేషన్ శిక్షణ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15రోజుల పాటు పోలీస్ అధికారులకు ప్రాథమిక శిక్షణ పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మబ్ ఆపరేషన్ డ్రిల్, ఇండోర్ తరగతులు మొదలగు అంశాల పట్ల మళ్లీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలో అత్యుత్తమ పాత్ర పోషించాలన్నారు. మంచి సమాజ స్థాపనలోట పోలీసు కుటుంబాల పాత్ర ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జోతిర్మని, ఆర్ఐలు సూరపు నాయుడు, అంజాత్ పాషా, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఆర్ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాల విషయమై డీఎల్‌పీవో విచారణ

తాండూరు రూరల్, జనవరి 23: గ్రామపంచాయతీల్లో ప్రతి నెలా పాలకవర్గం సభ్యులు సమావేశం నిర్వహించుకోవాలని తాండూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్ పాలకవర్గాన్ని ఆదేశించారు. తాండూరు మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం సమావేశాలు నిర్వహించకపోవడం గ్రామాభివృద్ధికి తీర్మానాలు ఇవ్వడం లేదని కొంతమంది వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో శంకర్‌నాయక్, మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌తో కలిసి సమీక్షించారు. ప్రతినెలా గ్రామపంచాయతీలో సమావేశాలు నిర్వహించి పాలకవర్గం సభ్యులంతా కలిసి అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయాల్సి ఉండగా, ఇవేమీ చేయడం లేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ విషయంపై ఎందుకు సమావేశాలు నిర్వహించడం లేదు? సర్పంచ్, వార్డు సభ్యులు ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా? అని పంచాయతీ కార్యదర్శి భవానీని ప్రశ్నించారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలలో సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఎందుకు నిర్వహించలేదని ఆమెపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి 12న సమావేశం నిర్వహించినప్పటికీ సర్పంచ్ నందిని, ఉపసర్పంచ్ చెన్నప్ప, వార్డు సభ్యుల సంతకాలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌ను కూడా మీరెందుకు పర్యవేక్షించడం లేదని, అలాంటప్పుడు మీపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వార్డు సభ్యులకు సమావేశం ఉందని నోటీసు ఇచ్చి రాకుంటే మూడు నెలల తర్వాత వారిని పదవి నుంచి తొలగించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మహిళా వార్డు సభ్యులైతే ఆరు నెలలు సమావేశానికి రాకుంటే



పంచాయతీలో తీర్మానాల విషయమై కార్యదర్శిని ప్రశ్నిస్తున్న డీఎల్‌పీవో

వారిని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తొలగిస్తామన్నారు. అనంతరం గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించగా, రూ.18లక్షల 700, 70లు ఉన్నట్లు గుర్తించారు. వార్డు సభ్యులు శామప్ప, సునిత, యశోధ, తిరుపతిగౌడ్‌లతో తీర్మానంపై సమీక్షించారు. 2022లో రూ.8లక్షలకు సంబంధించి తీర్మానం చేసినప్పటికీ పనులు చేయలేకపోయారని, వార్డు సభ్యుడు శామప్ప డీఎల్‌పీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రికార్డుల్లో తమ సంతకాలు కూడా సక్రమంగా లేవని, కొన్ని సంతకాలు వారే చేసుకున్నారని డీఎల్‌పీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వారి సంతకాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ఘట్‌కేసర్, జనవరి 23: బీజేపీ అంక్షితలు పంచడం తప్పు చేసిందేమీ లేదంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు నాలుగున్నరేళ్లు మంత్రిగా పని చేసిన మల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక్కరూపాయి అయినా తీసుకువచ్చావా? అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలకోట్ల నిదులు మంజూరు చేసిందని అన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. కొడుకు ఎంపీ టికెట్టు కోసం మల్లారెడ్డి దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. మల్లారెడ్డి దేవుడని పొగిడిన వారంతా పదవులు కోల్పోయి మాజీలు అయ్యారని, ఆయనది ఐరన్‌లేగ్ అని ఎద్దేవా చేశారు. ఏపార్టీలో చేరినా ఆపార్టీ అధికారం కోల్పోడం తప్పదన్నారు. ఆయన ప్రజాసేవను మరిచి రాజకీయంను వ్యాపారం చేశాడని ఆరోపించారు. ప్రధానంగా ఎన్నికల్లో భారీగా డబ్బులు, మద్యం పంపిణీ చేసి గెలుపొందడమే ఆయన లక్ష్యమని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

అన్నారు. కండ్లకోయలో కేటీఆర్ శంకుస్థాపన చేసిన ఐటీహబ్ ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసగించారని వాపోయారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, శివ, నరేష్, కృష్ణ, సత్యానారాయణరెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు కార్మికులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, జనవరి 23 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నేతలతో కలిసి ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల బిల్లులు, వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పూర్తి అయిందన్నారు. కాని మధ్యాహ్న భక్షజన కార్మికులకు మాత్రం ఐదు నెలలుగా బిల్లులు, వేతనాలు మంజూరు చేయడం లేదన్నారు. అలాగే మార్కెట్‌లో కోడి గుడ్డు ధర పెరిగి కార్మికులకు రూ.2వేల నుండి 3వేల వరకు నెలకు అదనంగా భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, జి.కిషన్‌జీ, అశ్విని, శైలజ, అండాలు, రజని, కళమ్మ పాల్గొన్నారు.



షీల్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

క్రీడల్లో గెలుపోటములు సహజం

కొందుర్గు, జనవరి 23: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 10న మొదలైన కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నమెంట్‌లో మొత్తం 8 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ముంబాయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడగా, ముంబాయి టీం విజేతగా నిలిచింది. విజేతకు రూ.30వేల నగదును, షీల్డ్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఢిల్లీ జట్టుకు రూ.20వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో ప్రతీ సంవత్సరం వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్ల నిర్వహణతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, బి.నరేందర్, రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, ఎండీ షబ్బీర్, రశీద్, షుకూర్, కె.శ్రీశైలం, సత్యనారాయణ, శ్రీనివాస్, చిన్నరాజు, చంద్రశేఖర్, కె.ప్రవీణ్, సచిన్, జీబీ కృష్ణ, నర్సింలు, డి.రాంచంద్రయ్య, రెడ్డి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మాల్‌లో రైతులకు ఫిర్యాదు చేసేందుకు పేపర్ కాపీలను అందజేస్తున్న నిర్వాహకులు

ధరణి పోర్టల్‌తో తీరని అన్యాయం

యాచారం, జనవరి 23 : ధరణి పోర్టల్ కారణంగా రైతులకు అనేక కష్టాలతో పాటు తీరని అ న్యాయం జరుగుతోందని వైస్ ఎంపీపీ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. మంగళవారం మండలంలోని మాల్, తాటిపర్తి గ్రామాల్లో లీఫ్స్ సంస్థ బృందం భూన్యాయ శిబిరం నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ భూములు కొనుగోలు చేసి పదేళ్లు గడుస్తున్నా రైతు బంధు, రైతు బీమా ఆర్థిక సాయం అందలేదని బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకుల రైతు బంధు, రైతు బీమాపై అవాక్కులు, చెవాక్కులు విడ్డూరంగా ఉందన్నారు. లీఫ్స్ సంస్థ భూ న్యాయ శిబిరాలను గ్రామగ్రామాన ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవడం అభినందనీయమన్నారు. సర్పంచులు పి.కవిత, డి.రమేష్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకటనారాయణ

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

యాచారం, జనవరి 23 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై వెంకటనారాయణ సూచించారు. మంగళవారం యాచారంలోని సెయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ సంస్థ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బస్టాండ్‌లో సీబీఎస్ఈ సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అమ్మనాన్నలు పొలం పనులు, చిరు ఉద్యోగాలు చేస్తూ మిమ్మల్ని చదివిస్తున్నారనే విషయం మర్చిపోవద్దని, ప్రతీ ఒక్కరు ఇష్టంతో చదవాలని, బట్టీపట్టే విధానం మంచిది కాదని అన్నారు. సెయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ సంస్థ సీబీఎస్ఈ సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా విద్యను వ్యాపారంగా చూడరాదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేచల్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.



పామెన జ్యోతి భీంభరత్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు జయమ్మ

జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి

షాబాద్, జనవరి 23 : జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా పామెన జ్యోతి భీంభరత్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు జయమ్మ తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో షాబాద్ మండలం నరెడ్లగూడకు చెందిన జ్యోతిభీంభరత్‌కు నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంలాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని జ్యోతి అన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండలాధ్యక్షురాలు నాగమణి, మున్సిపల్ అధ్యక్షురాలు సింధూజ, మొయినాబాద్ మండలాధ్యక్షురాలు కావ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాభవన్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయింపు

ఆమనగల్లు, జనవరి 23 : మండలంలోని చింతలపల్లి గ్రామంలో అంబేడ్కర్ కళాభవన్ నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు నిధుల నుంచి నిధులు విడుదల చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చింతలపల్లి సర్పంచ్ మంజుల యాదయ్యకు ఎంపీ నిధుల మంజూరు ప్రొసీడింగ్‌ను అందజేశారు. కాగా, అంబేడ్కర్ కళాభవన్ నిర్మాణానికి ఎంపీ రాములు రూ.20 లక్షలు మంజూరుచేసి మొదటి విడత రూ.5 లక్షలు కేటాయించారని సర్పంచ్ పేర్కొన్నారు. ఈనెల 26న భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంజుల యాదయ్యలు తెలిపారు.

వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై అదనపు కలెక్టర్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ప్రతిమాసింగ్

ఆదిభట్ల, జనవరి 23 : రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మంగళవారం ఆదిభట్ల మున్సిపాలిటీని సందర్శించారు. వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ప్రతిపాదనలపై తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీయేటా బడ్జెట్‌కు ముందు ప్రతి ప్రతిపా దనలకు సంబంధించి అధికారులు వివరాలు సేకరించి పలు సలహాలు, సూచనలు చేయడం సహజమని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. అయితే, నిజానికి అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన వివరాలు అధికారులు గోప్యంగా ఉంచారని తెలుస్తోంది. గత నెలలో ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాసం వ్యక్తం ప్రకటిస్తూ కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయమై అదనపు కలెక్టర్ పర్యటన ఉండవచ్చని సమాచారం. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అకౌంటెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు వినతి

కడ్తాల్, జనవరి 23 : మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతి పత్రమందజేశారు. కడ్తాల్‌లో ఆధార్ కేంద్రం లేక ప్రజలు వెల్దండ, మహేశ్వరం, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆధార్ కార్డులు లేనికారణంగా విద్యార్థులు కూడా ఇబ్బందులకు లోనవుతున్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌కు సన్మానం

ఆమనగల్లు, జనవరి 23 :ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం ఎన్ఎస్‌యుఐ మండలాధ్యక్షుడు ఎండీ ఫరీద్, ఆమనగల్లు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో మహేశ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు మహేశ్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఫరీద్, శ్రీకాంత్

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 23: గ్రామాలలో వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగి గ్రామాలలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడడంతో పాటు ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు చొరవ తీసుకోవాలన్నారు. ఆమనగల్లు మండలంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పలు శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలలో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి సర్పంచ్ మంజుల యాదయ్య ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి అభినందించారు. ఈనెల 26న చింతలపల్లిలో గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేతో పాటు ఎంపీ రాములుకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖానాపూర్ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు యాదయ్య, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ మంజుల యాదయ్య

గ్రామాల ప్రగతికి ప్రణాళికలు రూపొందించాలి

యాచారం, జనవరి 23 : ప్రతీ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి సరిపడా నిధులు రాబట్టుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఏయే వార్డులో సీసీ రోడ్లు, భూగర్భడ్రైనేజీ నిర్మాణం తదితర పనులు పూర్తిచేయడానికి ఎంత మేర నిధులు అవసరమవుతాయో ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రతీ గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామంలో ఎలాంటి పనులు చేపట్టరాదన్నారు. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఉస్మాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత, ఉపాధి హామీ పథకం ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కొప్పు సుకన్యబాషా

అందరికీ ఆదర్శం.. సుభాష్ చంద్రబోస్



మొయినాబాద్ : పెద్దమంగళవారంలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల/మొయినాబాద్/కడ్తాల్, జనవరి 23 : నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అందరికీ ఆదర్శమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నేతాజీ సంఘం వైస్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు మాధవగౌడ్, పెద్దమంగళవారం సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి తెలిపారు. మంగళవారం సుబాష్‌చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామం, మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళవారం గ్రామంలోని నేతాజీ విగ్రహాలకు వేర్వేరుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ప్రభాకర్, లక్ష్మీనరాయణ, శ్రీనివాస్, నాయకులు రామచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, కృష్ణ, రాజు, రాజీరెడ్డి, నారాయణ్‌రెడ్డి, రాము, నాగరాజు, సురేందర్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాల ఐక్యవేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో యువకులు, విద్యార్థులు , స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. సుభాష్ చంద్ర బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమ, సేవా నిరతిని, ధైర్య సాహసాలను కొనియాడారు. సుభాష్ చంద్ర బోస్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు గురిగళ్ల చంద్రయ్య, కాంటేకార్ వెంకటేశ్, లక్ష్మీనారాయణ, మహేశ్, దేవి, మురళీ, కృష్ణ, చందు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : బోస్ జయంతి వేడుకల్లో ఎర్రోళ్ల రాఘవేందర్, తదితరులు

పథకం ప్రకారమే.. ప్రారంభోత్సవానికి అడ్డు

● కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్



మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీ

కేశంపేట, జనవరి 23: మండల పరిధిలోని కొత్తపేట గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు పథకం ప్రకారమే అడ్డుకున్నారని కొత్తపేట సర్పంచ్ కె.నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్‌లు ఆరోపించారు. కేశంపేట మండల కేంద్రంలో మంగళవారం కొత్తపేట సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డిగూడ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, ఇప్పలపల్లి సర్పంచ్ ఆంజనేయులు, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారుల సూచన మేరకే 22న జీపీ భవన ప్రారంభోత్సవం పెట్టుకున్నామని తెలిపారు. ఓ అజ్ఞాత వ్యక్తి ఎమ్మెల్యేను రాకుండా అడ్డుకోవడంతోనే ప్రొటోకాల్ రగడ అని ప్రచారమైనట్లు తెలిపారు. భవన ప్రారంభోత్సవానికి ఈనెల 16 లేదా 18న తేదీల్లో ఎమ్మెల్యేను ఆహ్వానించామని, అయితే ఆయన రాకుండ కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు. 22న అయోధ్య ఆలయ ప్రారంభ ముహూర్తంను ఖరారు చేసుకుని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో అధికారులకు సమయం తీసుకోవాలని సూచించామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవన ప్రారంభం అడ్డుకునేందుకే, ప్రొటోకాల్ వివాదం తెరపైకి వచ్చిందని వివరించారు. కేశంపేట పీఆర్ ఏఈ ఫిర్యాదు చేస్తే పోలీసులు తమను ఉదయం 5 గంటలకు అరెస్ట్ చేశారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుని ఎమ్మెల్యేను ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన షారుఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్ రెడ్డి, పాపిరెడ్డిగూడ నాయకుడు తాండ్ర శ్రావణ్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను విమర్శించడం తగదన్నారు. కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొటోకాల్ వివాదం అంటూ కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్‌లను సోమవారం అరెస్ట్ చేసి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొందుర్గు పోలీస్ స్టేషన్ ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన, పొన్న వెంకట్‌రెడ్డి, పొన్న సన్నిరెడ్డి

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

షాబాద్, జనవరి 23 : చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని రేవంత్ ఫోర్స్ వ్యవస్థాపక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్న సన్నిరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం నగరంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరగా సానుకూలంగా స్పందినట్లు సన్ని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పొన్న వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆమనగల్లు, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు, రాంనుంతల మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ఆకుతోటపల్లి ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన పుస్తకాలను ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎంలు రామలక్ష్మి, పద్మ, తదితరులున్నారు.

దాతల సహకారంతో బోరు ఏర్పాటు

ఆమనగల్లు, జనవరి 23 : ఆమనగల్లు పట్టణంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వద్ద తాగునీటి వసతి కల్పనకు మేడిగడ్డ తండాకు చెందిన ఇస్లావత్ సోమ్లు, వడ్త్యావత్ రాజ్‌కుమార్, నేనావత్ రమేశ్‌లు ముందుకువచ్చారు. నీటి వసతి లేక ప్రజలు, ఆలయ నిర్మాణానికి ఇబ్బంది కలుగుతోంది. ఈనేపథ్యంలో స్పందించిన ముగ్గురు గిరిజన యువకులు బోరు నిర్మాణానికి ముందుకు వచ్చారు. మంగళవారం తండా నాయకుడు రవీందర్ నాయక్, బోరు నిర్మాణం పనులను ప్రారంభించారు. బోరు ఏర్పాటుకు ముందుకు వచ్చిన యువకులను గిరిజన నేతలు అభినందించారు. దశరథ్ నాయక్, హేమనాయక్, రాములు, పురుషోత్తం, శంకర్, లక్ష్మణ్, జయరామ్, నందు, రఘు, మహిపాల్, సురేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న రవీందర్ నాయక్

బాధితుడికి రూ.10 వేల సాయం

కడ్తాల్, జనవరి 23: వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ హర్యనాయక్‌కు చెందిన 11 మేకలను ఇటీవల గుర్తుతెలియని దుండగులు అపహరించారు. మంగళవారం హర్యనాయక్‌ను సర్పంచ్ రవికుమార్ పరామర్శించారు. బాధితుడికి రూ.10వేలు అందజేశారు. ప్రభుత్వపరంగా తగిన సాయమందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఉపసర్పంచ్ రాణిపాండునాయక్, నాయకులు జైపాల్‌నాయక్, లక్ష్మణ్, తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నందిగామ, జనవరి 23: నందిగామ మండలపరిధిలోని చేగుర్ ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరానికి చెందిన పదవతరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం చేగుర్ శివారులోని ప్రైవేట్ రిసార్టులో ఘనంగా నిర్వహించుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అందరు నేడు వివిద రంగాల్లో స్థిరపడ్డారు. ఈసందర్భంగా వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వ సలహాదారులకు శుభాకాంక్షలు



మల్లురవికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, జనవరి 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారులుగా నూతనంగా ఎన్నుకోబడిన వేం నరేందర్‌రెడ్డి, మల్లు రవి, హర్కవేణుగోపాల్‌లను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారులను మర్యాద పూర్వకంగా కలిసి వారికి స్వీట్లతో పాటు పూలబొకేలను అందజేసినట్లు మధుసూదన్ స్పష్టం చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనకు సిద్ధమవ్వాలి

ఆమనగల్లు, జనవరి 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనకు సిద్ధమవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రైతాంగ పోరాట ఫలితంగా దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను ఉప సంహరించుకుని పార్లమెంట్‌లో బిల్లు పెడుతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి మళ్లీ దొంకదారిన నల్లచట్టాలను అమలు చేసే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఆమనగల్లు మండలంలో మంగళవారం మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. సంఘం నాయకులతో కలిసి రైతులతో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నల్లచట్టాలను అమలుచేసే ప్రయత్నాలను వీడకపోతే దేశవ్యాప్తంగా ప్రజా తిరుగుబాటు తప్పదన్నారు. రైతుల, కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్, సంపన్న వర్గాల కొమ్ముకాస్తుందని మండిపడ్డారు. విద్యుత్, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కుట్ర చేస్తుందని ప్రజలంత దాన్ని గమనించి తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఆయా కుట్రలను తిప్పికొట్టడానికి ఈనెల 26న దేశ వ్యాప్తంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, వామ పక్ష ప్రజా సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదలపై భారం మోపుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. ఆమనగల్లులో ఈనెల 25న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రైతు సంఘం సహయ కార్యదర్శి ఎం. రామకృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కానుగుల వెంకటయ్య, జల్లెల్ల పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

క్రైం కార్నర్

పట్టపగలు ఇంట్లో చోరీ

● 6 తులాల బంగారం, రూ.80వేలు అపహరణ

షాద్‌నగర్ రూరల్, జనవరి 23 : షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో పట్టపగలు గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి కథనం ప్రకారం.. రాంనగర్ కాలనీలో నివాసముండే రాజు పట్టణంలోని గ్రంథాలయం సమీపంలో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రాజు ఇంటి నుంచి హోటల్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. తిరిగి 2 గంటల ప్రాంతంలో రాజు బావ ఇంటికి వెళ్లగా.. తాళం విరుగొట్టి ఉంది. విషయాన్ని రాజుకు చెప్పగా వచ్చి ఇంట్లోకి వెళ్లి చూశాడు. బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, రూ.80వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాక్ ప్రాజెక్టు విల్లాలో పుస్తెలతాడు అపహరణ

మహేశ్వరం, జనవరి 23 : మండల పరిధిలోని తమ్మలూరు గ్రామ రెవెన్యూలోగల మ్యాక్ ప్రాజెక్టులో 619 నెంబర్ విల్లాలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నాలుగు తులాల పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. మహేశ్వరం ఎస్సై రవిందర్ కథనం ప్రకారం.. మ్యాక్ ప్రాజెక్టులోని 619 నెంబర్ విల్లాలో నివాసముంటున్న పుట్ట రాము భార్య రాత్రి పడుకునే సమయంలో ఒంటిపైన ఉన్న మంగళసూత్రాన్ని తీసి టేబుల్‌పై పెట్టింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనకభాగంలో ఉన్న కిటికీ తలుపులు తొలగించి ఇంట్లోకి ప్రవేశించి పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్సై రవిందర్ తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిభట్ల, జనవరి 23 : మార్కెట్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుండి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర, పూనేకు చెందిన చత్రీయా (22) కుటుంబం వలస వచ్చి కొంగరకలాన్‌లో నివాసం ఉంటూ ఇద్దరు సోదరులతో కలిసి కూలి పనికి వెళ్లేది. కాగా సోమవారం ఇంట్లోకి కావాల్సిన సరకులు తెచ్చేందుకు తుక్కుగూడ సంతకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. మంగల్ బంజారా అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తు కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మరో యువతి..

ఆదిభట్ల, జనవరి 23 : మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పూనేకు చెందిన చత్రీయా(22) కుటుంబం వలస వచ్చి కొంగరకలాన్‌లో నివాసం ఉంటోంది. ఇద్దరు సోదరులతో కలిసి ఆమె కూలి పనికి వెళ్లేది. సోమవారం ఇంట్లోకి కావాల్సిన సరకులు తెచ్చేందుకు తుక్కుగూడ సంతకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. మంగల్ బంజారా అనే వ్యక్తిపై అనుమానం ఉందని కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి



రవి(ఫైల్)

నందిగామ, జనవరి 23: ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుకాల నుంచి ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రాయన్‌గుట్ట సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. చంద్రాయన్‌గుట్టకు చెందిన రవి బైక్‌పై నందిగామ వైపు వెళ్తుండగా.. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల కృష్ణ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రాజు

ఆదిభట్ల, జనవరి 23 : సైబర్ నేరాల పట్ల ప్రతి వ్యక్తి అప్రమత్తంగా ఉండాలని ఆదిభట్ల ఎస్ఐ రాజు అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆదిభట్ల పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ రాజు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల రోజుకోవిధంగా మోసాలకు తెగబడుతున్నారని, విద్యార్థులు మాత్రమే కాకుండా సమాజంలో ప్రతీ వ్యక్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లావణ్య, సైబర్‌క్రైమ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం



విద్యార్థులకు షూస్ అందిస్తున్న దాతలు

చేవెళ్ల, జనవరి 23 : పేద విద్యార్థులకు చేయూత నివ్వడం అభినందనీయమని కమ్మెట సర్పంచ్ తంలసీ రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కమ్మెట గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన అంజన్‌కుమార్‌గౌడ్ సొంత డబ్బులతో విద్యార్థులకు ఉచితంగా షూస్ అందించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ పేద విద్యార్థులకు దాతలు చేయూతనివ్వాలని సూచించారు. సీనియర్ నాయకులు మాధవ్‌గౌడ్, సురేందర్‌గౌడ్, దర్శన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, రామకృష్ణ, జంగయ్య, విద్యాకమిటీ చైర్మన్లు పాండు, అంజి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

చేవెళ్ల, జనవరి 23 : విద్యార్థులు చదువుతో పాటు వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకోవాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు రకాల వంటకాలు, తినుబండారాలు తయారుచేసి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతోపాటు వ్యాపార రంగాల్లో రాణించాలని, ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈడీపీ సెల్ కన్వీనర్ ఆర్.వైష్ణవి, అధ్యాపకులు అనురాధ, రూప, రవీంద్రన్, జ్యోతి, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి, స్వర్ణలత, సతీష్, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, శకుంతల, వీరేషం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో అక్బర్, యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేవెళ్ల మండల శాఖ రూపొందించిన క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షుడు దయానంద్, ప్రధాన కార్యదర్శి శివానందం, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, జిల్లా కార్యదర్శులు అంజయ్య, మెగులయ్య, మండల గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీ రత్న, మెహరున్నీసా, షహజాది, మమత, సుధా, సునీత, సుమిత్ర, శ్రీలక్ష్మి, పద్మ, రంగయ్య, శైలజ, లక్ష్మి తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు